ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -341 | పేజీలు - 8 | వెల - 03/- | ఆదివారం 29 మార్చి 2026



## మలుపు తిరిగిన యుద్ధం

**యుద్ధ క్షేత్రంలోకి హౌతీలు..**

**ఇజ్రాయిల్‌పై బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం**

**సౌదీలో అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి**

**దెబ్బతిన్న రీఫ్యూయలింగ్ విమానాలు..పలువురికి గాయాలు**

**పోర్టులు, ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా టెహ్రాన్ భీకర దాడులు**

**ఢిల్లీమార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** ఇరాన్ యుద్ధం ఐదో వారంలో ప్రవేశించిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. పశ్చిమాసియాలో గత నెల 28న మొదలైన పోరు శనివారం కొత్త మలుపు తిరిగింది. యుద్ధం మొదలైన తర్వాత తర్వాత తొలిసారిగా యెమన్‌కు చెందిన హౌతీలు రంగంలోకి దిగారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌కు దక్షిణాన ఉన్న ఇజ్రాయిల్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించారు. లక్ష్యాలను సాధించే వరకూ సైనిక చర్యలను కొనసాగిస్తామని ప్రకటించారు. ఇరాన్, లెబనాన్, ఇరాక్, పాలస్తీనా భూభాగాలపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు ప్రతీకారంగా పోరు ప్రారంభించామని తెలిపారు.

మిగతా 2లో.

# అమరావతి అజేయం,అద్భుతం

## అమరావతి రాజధాని కోసం ఏకగ్రీవ తీర్మానం ఆమోదం

**ఇక అంగుళం కూడా కదిలించలేరు**

**భూములతో పాటు భవిష్యత్తునూ ఇచ్చిన రైతులు**

**అందుకే అమరావతి మన శాశ్వత రాజధాని**

**స్వీయాభివృద్ధి పద్ధతిలో రాజధాని నిర్మాణం**

**ఒకే రాజధాని.. అభివృద్ధి మాత్రం వికేంద్రీకృతం**

**అమరావతితోపాటు విశాఖ, తిరుపతీ మెగా సిటీలే**

**తీర్మానానికి మద్దతు ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు**

**అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన**

**2028 నాటికి తొలి దశ పనులు పూర్తి**





**అమరావతిమార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** అమరావతి అజేయం, అద్భుతమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇక ఒక్క అంగుళం కూడా అమరావతిని కదల్చలేరని స్పష్టం చేశారు. "ఇది చట్టబద్ధమైన భరోసా. తెలుగు వైభవం అయిన అమరావతే శాశ్వత రాజధాని" అని చంద్రబాబు శాసనసభలో పునరుద్ఘాటించారు. 2028 నాటికల్లా అమరావతి తొలిదశ పనులు పూర్తవుతాయని ప్రకటించారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగా లు అసామాన్యమైనవని, అనేక కష్టనష్టాలను తట్టుకున్న వారికి పాదాభివందనం అంటూ చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. తీర్మానానికి మద్దతు పలికిన సభ్యులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఏమన్నారంటే...

మిగతా 2లో.

## ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

**ప్రపంచంలోని ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది: ప్రధాని మోదీ**

**ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై యుద్ధం ప్రభావం పడిందన్న ప్రధానిమోదీ**

**ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని వెల్లడి**

**ఇంతటి సంక్షోభం సమయంలోనూ అభివృద్ధి కొనసాగుతోందని ఉద్ఘాటన**



**ఢిల్లీమార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం

మిగతా 2లో.

## నేపాల్ నూతన ప్రధాని బాలెన్ షా ప్రకంపనలు

### మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ అరెస్ట్

**గతేడాది జరిగిన జెన్-జీ ఉద్యమం అణచివేత కేసులో చర్యలు**

**ఖాట్మండు వ్యాప్తంగా ప్రతిపక్ష సీపీఎన్-యూఎంఎల్ నిరసనలు**

**అరెస్ట్ అనంతరం అస్వస్థతకు గురైన ఓలీ.. ఆసుపత్రికి తరలింపు**



**ఢిల్లీమార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** నేపాల్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతన ప్రధాని బాలెన్ షా వచ్చీరావడంతోనే విపక్ష నేతలను టార్గెట్ చేశారు. ఈ క్రమంలో మాజీ ప్రధాని, ప్రధాన ప్రతిపక్ష నేత కేపీ శర్మ ఓలీని పోలీసులు శనివారం

మిగతా 2లో.

## ఏపీలో కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ కళ్లెం..




**కఠిన నిబంధనల జారీ**

**ఏపీలో కోచింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలు**

**విద్యార్థుల ఒత్తిడి, ఆత్మహత్యల నివారణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**రోజుకు 5 గంటలకే పరిమితం.. ఆదివారం తప్పనిసరిగా సెలవు**

**కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు**

## త్వరలో 'ఈ-చెక్కులు'

**డిజిటల్ చెల్లింపుల్లో ఆర్బీఐ విప్లవాత్మక మార్పులు..**

**డిజిటల్ చెల్లింపుల కోసం ఆర్బీఐ 'పేమెంట్స్ విజన్ 2028' విడుదల**




**ఢిల్లీమార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ముందడుగు వేసింది. 'పేమెంట్స్ విజన్ 2028' పేరుతో శుక్రవారం ఒక కొత్త రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ చెక్కుల ప్రవేశం, మోసపూరిత లావాదేవీలపై బ్యాంకుల బాధ్యతను పెంచడం వంటి పలు సంస్కరణలను ప్రతిపాదించింది.

మిగతా 2లో.

## అమరావతి ఒక్కటే రాజధాని..

**గతంలో మూడు రాజధానుల పేరిట వైసిపి నాటకాలు**

**భూములు ఇచ్చిన రైతులను కేసులో హింసించారు**

**బలమైన నాయకుడు చంద్రబాబు వల్లనే అభివృద్ధి సాధ్యం**

**అందుకే కూటమి కట్టి ఎన్నికల్లో పోటీ చేశాం**

**అసెంబ్లీలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్**



**అమరావతి,మార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ

మిగతా 2లో.

## మూసీకి ఆధ్యాత్మికత

### రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం.. శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

**మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం**

**8 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన**

**మూసీ నది మధ్యలో 100 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటు.. పర్యాటక సౌకర్యాల కల్పన**

**చారిత్రక ఆలయాలతో కలిపి ఈ ప్రాంతాన్ని 'చిన్న శ్రీశైలం'గా తీర్చిదిద్దే ప్రణాళిక**



**హైదరాబాద్ మార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు

మిగతా 2లో.

## జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం : పేర్ని నాని



**అమరావతి,మార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** రాజధాని అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పగా మార్చారని, కాంట్రాక్టర్ల దోపిడీ కోసం దీనిని ఒక 'ఏటీఎమ్'లా వాడుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని మండిపడ్డారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 21 వేల కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన చట్టబద్ధత తీర్మానం కేవలం ఒక 'డ్రామా' అని, శాసనమండలి ఆమోదం లేకుండా కేవలం

మిగతా 2లో.

## జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పుడూ ముందున్నా

**గతంలో ఉమ్మడి ఎపిలో అనేక కార్యక్రమాలు చేపట్టా**

**వారికి ప్రాధాన్యక్రమంలో భూములు ఇస్తాను**

**సోషల్ మీడియా వ్యక్తిత్వ హననంపై ఆందోళన**

**ఐజెయూ సమవేశంలో సిఎం చంద్రబాబు**




**అమరావతి,మార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):** జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడడంలో తానే ముందున్నానని, ఉమ్మడి ఎపిలో అయినా, విభజిత ఎపిలో అయినా అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని సిఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ 11వ ప్లీనరీ సమావేశాల ప్రారంభ కార్యక్రమంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి కాలంలో సోషల్ మీడియా ఓ పెద్ద సవాలుగా మారిందని అన్నారు. కొందరు వ్యక్తులు కేవలం అసభ్యకరమైన

మిగతా 2లో.

# ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

మొదటి పేజీ తరువాయి

కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు.

ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు, ప్రజలపై ఈ యుద్ధం భారం పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంతటి సంక్షోభ సమయంలో మన దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రశాంతతను పాటించాలని ప్రధాని మోదీ కోరారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు. నోయిడాలోని జేవార్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. రూ.11,200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఆధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సహాయంతో 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయం రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

# త్వరలో 'ఈ-చెక్కులు'

మొదటి పేజీ తరువాయి

వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఆర్బీఐ కీలక సూచనలు చేసింది. ప్రస్తుతం డెబిట్, క్రెడిట్ కార్డులకు మాత్రమే ఉన్న ఎనేబుల్/డిసేబుల్ సదుపాయాన్ని ఇకపై అన్ని రకాల డిజిటల్ చెల్లింపులకు వర్తింపజేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల ఖాతాదారులు తమ లావాదేవీలపై పూర్తి నియంత్రణ కలిగి ఉండవచ్చు. అంతేకాకుండా, అనధికారిక లావాదేవీలు జరిగినప్పుడు, డబ్బు పంపిన బ్యాంకుతో పాటు స్వీకరించిన బ్యాంకు కూడా ఉమ్మడి బాధ్యత వహించేలా ఒక ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావాలని యోచిస్తోంది.కొత్త వ్యాపార అవసరాలకు అనుగుణంగా కాగితపు చెక్కుల ప్రయోజనాలను, డిజిటల్ వేగాన్ని కలిపి 'ఈ-చెక్కుల'ను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆర్బీఐ తన నివేదికలో పేర్కొంది. దీంతోపాటు, చెల్లింపుల వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ-కామర్స్ మార్కెట్ ప్లేస్‌లు, ఇతర సెంట్రలైజ్డ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా తమ ప్రత్యక్ష నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలని భావిస్తోంది.వీటితో పాటు చెక్కుల భద్రతా ఫీచర్లను సమీక్షించడం, లావాదేవీలను సులభంగా ట్రేస్ చేసేందుకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడం, విదేశీ చెల్లింపులను వేగవంతం చేయడం వంటి అంశాలను కూడా ఈ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. ఈ మార్పుల ద్వారా దేశీయ చెల్లింపుల వ్యవస్థను మరింత వేగవంతంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని ఆర్బీఐ స్పష్టం చేసింది.

# నేపాల్ నూతన ప్రధాని బాలెన్ షా ప్రకంపనలు

మొదటి పేజీ తరువాయి

ఉదయం అరెస్ట్ చేశారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన 'జెన్-జీ' యువత ఉద్యమాన్ని అణచివేసిన ఘటనకు సంబంధించిన నరహత్య కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్ట్‌తో రాజధాని ఖాట్మండూ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.ఓలీతో పాటు మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్‌ను కూడా భక్తపూర్ జిల్లాలోని వారి నివాసాల నుంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం ఓలీ అస్వస్థతకు గురికావడంతో, ఆయనను ఖాట్మండూలోని ఓ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓలీ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆయన నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూఎంఎల్) కార్యకర్తలు ఖాట్మండూలో ఆందోళనలు చేపట్టారు. పలుచోట్ల టైర్లు కాల్చి, విచారణ కమిషన్ నివేదిక ప్రతులను దహనం చేశారు. నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. శుక్రవారం కొలువుదీరిన ప్రధాని బాలేంద్ర షా నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తన తొలి కేబినెట్ సమావేశంలోనే విచారణ కమిషన్ నివేదికను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ అరెస్టులు కక్షపూరితమైనవని, చట్టవిరుద్ధమని యూఎంఎల్ పార్టీ ఖండించింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఉన్నతస్థాయి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

ఇదిలా ఉండగా, ఓలీ అరెస్ట్‌ను నేపాల్ మాజీ అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ 'అవివేక నిర్ణయం'గా అభివర్ణించారు. ఈ చర్య దీర్ఘకాలిక పరిణామాలకు దారితీయవచ్చని, దేశంలో అస్థిరత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన అధ్యయనం, న్యాయ ప్రక్రియ లేకుండా నివేదికను అమలు చేయడం ప్రజాస్వామ్య విలువలకే విఘాతమని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# మలుపు తిరిగిన యుద్ధం

మొదటి పేజీ తరువాయి

యెమన్‌కు ఆవల ఉన్న లక్ష్యాలపై కూడా దాడి చేసే సామర్థ్యం తమకు ఉన్నదని హైతీలు ఈ చర్య ద్వారా నిరూపించుకున్నారు. అరేబియన్ ద్వీపకల్పం, ఎర్ర సముద్రం పరిసరాలలో ప్రయాణించే నౌకలను అడ్డుకునే సామర్థ్యం హౌతీలకు ఉంది. 2023 అక్టోబర్ 7 తర్వాత గాజాలో హమాస్‌కు మద్దతుగా వారు జల రవాణాను అడ్డుకున్న విషయం తెలిసిందే. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టు ఉండగా సూయజ్ కెనాల్‌కు దారితీసే బాబ్ అల్-మందబ్ జలసంధిపై హౌతీలకు నియంత్రణ ఉంది.

సౌదీలో దెబ్బతిన్న అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలుడపలువురికి గాయాలు

గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై దాడులను ఇరాన్ ముమ్మరం చేసింది. సౌదీ అరేబియాలోని కీలక అమెరికా స్థావరంపై ఆరు క్షిపణులు, 29 డ్రోన్లతో శుక్రవారం పెద్ద ఎత్తున దాడి జరిపింది. ఈ దాడిలో పదిహేను మంది అమెరికా సైనికులు గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దాడిలో అనేక అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడి చేసిందని అమెరికా అధికారి ధృవీకరించారు.

యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ దాడి చేయడం ఇది రెండోసారి. కాగా ఒమన్ తీరంలో ఉన్న అమెరికా నౌకపై ఇరాన్ దళాలు శనివారం ఉదయం దాడి చేశాయి. ఒమన్ తీరంలో దాడి జరిగినప్పటికీ ఆ దేశం యొక్క సార్వభౌమత్వాన్ని పూర్తిగా గౌరవిస్తూనే ఈ చర్యకు దిగామని ఖతమ్ అల్-అన్బియా కేంద్ర కార్యాలయ ప్రతినిధి అబ్రహం జోల్ఫగనీ తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పుడూ ముందున్నా

మొదటి పేజీ తరువాయి

కంటెంట్‌ను ప్రచారం చేయడానికి, ఇతరుల వ్యక్తిత్వ హననం చేయడానికే సామాజిక మాధ్యమాలను వాడుతున్నారని మండిపడ్డారు. 'తప్పుడు ప్రచారాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరం. దీనిని ఎలా నియంత్రించాలో, ప్రజలను ఎలా చైతన్యపరచాలో మనమందరం ఆలోచించాలి. రాబోయే ఒకటి రెండేళ్లలో 3వ స్థానానికి, 2038 నాటికి 2వ స్థానానికి, 2047 లేదా 2050 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా మన దేశం ఎదిగే అవకాశముందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపోతే గతంలో హైదరాబాద్‌లో ప్రెస్ క్లబ్‌లకు, జర్నలిస్టులకు విలువైన ప్రాంతాల్లో భూములిచ్చామన్నారు. అమరావతిలోనూ పాత్రికేయుల నివాసాల కోసం భూమి కేటాయించేందుకు సానుకూలంగా పరిశీలిస్తామని భరోసానిచ్చారు. మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం సహా జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని పది లక్షల రూపాయలకు పెంచామని.. డెస్క్ జర్నలిస్టులకు, సబ్ ఎడిటర్లకూ అక్రిడిటేషన్, బస్సు ప్రయాణ రాయితీలు కల్పించామని చెప్పుకొచ్చారు. అమరావతిలో భూమి మానిటైజేషన్ ప్రాజెక్ట్ అయినప్పటికీ.. ఓ పద్ధతి ప్రకారం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకుంటాం. గతంలో కేవలం కమ్యూనిస్ట్ పార్టీలే తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికి సొంత పత్రికలను కలిగిఉండేవి. కానీ.. నేడు రాజకీయ నాయకులే స్వయంగా మీడియా సంస్థలను నడుపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైన ధోరణి. వృత్తిపరమైన మీడియా, రాజకీయ పార్టీల యాజమాన్యంలోని మీడియాల మధ్య స్పష్టమైన తేడా ఉండాలని నేను కోరుకుంటున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను రాజకీయాల్లో ఉన్నానని ఈ సందర్భంగా స్మరించుకున్నారు చంద్రబాబు. కరెంటులేక పొలాలు ఎండిపోతున్నాయని తాను అసెంబ్లీని వాయిదావేసి మరీ క్షేత్రస్థాయికి వెళ్లిన రోజులు గుర్తున్నాయన్నారు. '90వ దశకం చివరలో నేను విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాను. దేశం కోసం, రాష్ట్రం కోసం నేను విద్యుత్ తీసుకొచ్చినా.. దురదృష్టవశాత్తూ 2004లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ఎప్పుడూ కలిసే సాగాలి. నేడు సమాజంలో విలువలు పడిపోవడం, సిద్ధాంతాలు మారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీ.రామారావును ఒకసారి 'మీరు కమ్యూనిజమా, సోషలిజమా లేక క్యాపిటలిజమా?' అని అడిగితే.. తానొక 'ఉత్తమ మానవతావాదిని' అని ఆయన సమాధానమిచ్చారు' అని ముఖ్యమంత్రి నాటి జ్ఞాపకాలను గురించి వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి ఏపీ సీఎం మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామంటే నాడు అందరూ నవ్వుకున్నారు. కానీ పాతికేళ్ల తర్వాత నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గ్లోబల్ కాంపిటెన్సీ సెంటర్లలో 25 శాతం హైదరాబాద్‌కే వస్తున్నాయి. రాష్ట్ర విభజన కంటే కూడా 2019 నుంచి 2024 మధ్య జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా నష్టపోయింది. మళ్లీ మనం అశ్రద్ధ చేస్తే, సమస్యలు వస్తాయనే విషయం గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా మూడు రాజధానులని మాట్లాడారు. కొంతవరకు మీడియా అంతా కూడా దీనిని

# మూసీకి ఆధ్యాత్మికత

మొదటి పేజీ తరువాయి

. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు.

శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం.

ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు.

ఈ ప్రాంతంలో ఇప్పటికే 1400 ఏళ్ల నాటి చాళుక్యుల



కాలం నాటి మచిలేశ్వర ఆలయం, 800 ఏళ్ల నాటి కాకతీయుల వీరభద్రస్వామి ఆలయం ఉన్నాయి. చేప ఆకారంలో శివలింగం ఉండటంతో ఈ ఆలయానికి మచిలేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఇప్పుడు నిర్మించబోయే అధునాతన ఓంకారేశ్వర ఆలయంతో ఈ ప్రాంతం ప్రాచీన, ఆధునికతల సంగమంగా మారి 'చిన్న శ్రీశైలం'గా ప్రసిద్ధి చెందుతుందని ప్రభుత్వం, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీలో కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ కళ్లెం..

## కఠిన నిబంధనల జారీ

**అమరావతి,మార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):**

ఏపీలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి, ఆత్మహత్యల నివారణే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ నిర్వహించాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ 'ఏపీ కోచింగ్ సెంటర్ల నియంత్రణ, పర్యవేక్షణ నిబంధనలు-2026' పేరుతో కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇప్పటికే నడుస్తున్న కేంద్రాలు కూడా మూడు నెలల్లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేసింది.

ఇటీవలి కాలంలో విద్యార్థులపై ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. కొత్త నిబంధనల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీయే కోచింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్లు మంజూరు చేయడం, విద్యార్థుల




నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడం వంటి బాధ్యతలు చూస్తుంది. అంతేగాక మీడియా కథనాలు లేదా పోలీసు రిపోర్టుల ఆధారంగా సుమోటోగా తనిఖీలు చేసే అధికారాన్ని కూడా ఈ కమిటీకి కల్పించారు.

కొత్త నిబంధనల ప్రకారం కోచింగ్ సెంటర్లు రోజుకు గరిష్ఠంగా ఐదు గంటలు మాత్రమే పనిచేయాలి. పాఠశాలలు, కళాశాలలు నడిచే సమయంలో కోచింగ్ తరగతులు నిర్వహించకూడదు. ఆదివారం తప్పనిసరిగా సెలవు ప్రకటించాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ప్రతి కేంద్రంలో ఒక వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, కౌన్సిలింగ్ అందించాలి. ఆత్మహత్యలను నివారించేందుకు స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

**ఫీజు తిరిగివ్వాలి.. సర్టిఫికెట్లు తీసుకోవద్దు**

ఫీజుల విషయంలో విద్యార్థులను వేధించకూడదని, ఒకవేళ విద్యార్థి మధ్యలో కోర్సు మానేస్తే మిగిలిన కాలానికి ఫీజును దామాషా ప్రకారం తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల ఒరిజినల్ అకడమిక్ సర్టిఫికెట్లను తీసుకోరాదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఈ కోచింగ్ సెంటర్లలో పనిచేయడంపై నిషేధం విధించారు. ప్రతి కోచింగ్ సెంటర్ తప్పనిసరిగా ఒక వెబ్‌సైట్‌ను నిర్వహించాలని, అందులో ఫీజులు, సిబ్బంది, మౌలిక వసతుల వివరాలను పొందుపరచాలని ఆదేశించారు.

**నిబంధనలు మీరితే రిజిస్ట్రేషన్ రద్దు.. కోచింగ్ సెంటర్లకు భారీ జరిమానాలు**

నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. లోపాలను సరిదిద్దుకోవడానికి 15 రోజుల గడువు ఇస్తారు. ఆ తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే మొదటిసారి రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష జరిమానా విధిస్తారు. మూడోసారి కూడా ఉల్లంఘన పునరావృతమైతే ఆ సెంటర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు.

# అమరావతి అజేయం,అద్భుతం

మొదటి పేజీ తరువాయి

"అమరావతికి వ్యతిరేకంగా జరిగిన కుట్రలు, కుతంత్రాలు, రైతుల పట్ల గత ప్రభుత్వం చేసిన దమనకాండ, అన్యాయం చూసి చలించిపోయాను. అనేక సందర్భాల్లో చాలా కోపం వచ్చింది. ఇంత అన్యాయం చేస్తారా? అని భావోద్వేగానికి లోనయ్యాను. ఆనాటి పరిణామాలను సభలో పలువురు సభ్యులు గుర్తు చేసినప్పుడు మరోసారి ఉద్వేగం కలిగింది. ఇంత జరిగినా రాజధానిపై వైసీపీ బుద్ధి మారలేదు. గతంలో మాదిరిగానే ఇంకా అమరావతిపై కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూనే ఉంది. రాజ్యాంగంలో రాజధాని అనే పేరే లేదంటున్నారు. వీళ్లకు ఏమైనా ప్రత్యేకమైన రాజ్యాంగం ఉందేమో? రాజారెడ్డి రాజ్యాంగాన్ని వాళ్లు అనుసరిస్తారు. కానీ మనం అంబేడ్కర్ రాజ్యాంగం అనుసరిస్తున్నాం. విభజన అనంతరం ఏపీకి రాజధాని విజయవాడ-గుంటూరు మధ్య ఏర్పాటు చేయాలని 46 శాతం మంది కోరుకున్నట్లుగా శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పింది. మేం అదే పని చేశాం. చారిత్రక నేపథ్యం ఉన్న అమరావతి ప్రాంతాన్నే రాజధానిగా ఏర్పాటు చేశాం. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న జగన్ బేషరతుగా అమరావతికి మద్దతు ఇస్తున్నానని గతంలో చెప్పారు. కానీ ఇప్పుడు రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారు."

"ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ 2019 నుంచే విధ్వంస పాలన మొదలుపెట్టింది. వారి చర్యలతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులు రాజధాని పరిరక్షణ కోసం, జగన్ మూడు ముక్కలాటకు నిరసనగా చేపట్టిన ప్రజా పోరాటాలను ఉక్కుపాదంతో అణచివేశారు. రైతులు, మహిళలపై కేసులు పెట్టి బూట్లతో తన్నారు. లాఠీలతో కొట్టారు. అడ్డగోలుగా కేసులు పెట్టి కీచకపర్వం సాగించారు. శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లును సెలెక్ట్ కమిటీ ద్వారా పాస్ చేయించాలని చూశారు. అయినా హైకోర్టు న్యాయాన్ని కాపాడింది. మూడు రాజధానుల ప్రతిపాదన తుగ్లక్ నిర్ణయమని మీడియా పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేసింది. గత పాలనలో రైతులు, మహిళలు, నేను, పవన్ సహా అందరం బాధితులమే."

"రాష్ట్రానికి రాజధాని ఒక్కటే. అదే అమరావతి. కానీ, అభివృద్ధి మాత్రం వికేంద్రీకృతం. రాష్ట్రంలోని అ న్ని ప్రాంతాలను ప్రగతిపథంలోకి తెస్తాం. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. ఆ ప్రాంతాలను మెగా సిటీలుగా అభివృద్ధిచేస్తాం. అమరావతి స్వయం అభివృద్ధి విధానంలో నిర్మితమవుతుందని చెప్పాం..అదే జరుగుతుంది."

"అమరావతి నిర్మాణ బాధ్యతను పార్లమెంట్ తీసుకుంటుందని ప్రధాని నరేంద్రమోదీ భరోసా ఇచ్చారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ. 15వేల కోట్ల తక్షణ సహాయం అందించింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి తొలిదశ పనులు పూర్తిచేసి అమరావతికి ఒక రూపు తీసుకొస్తాం. 2027 నాటికి రహదారులు, లే అవుట్‌లు సహా కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన పూర్తవుతుంది. ప్రస్తుతం రూ.56వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయించి ప్రధాన మంత్రిని పిలిపించి, ఆయనతోనే ప్రార ంభింపచేస్తాం. ఇదే మా సంకల్పం. ప్రతి తెలుగువ్యక్తీ గర్వపడేలా అమరావతి రాజధాని ఉంటుంది. నాది అమరావతి, నా రాజధాని అమరావతి అని తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునే రోజు తప్పకుండా వస్తుంది." అని సీఎం చంద్ర బాబు వ్యాఖ్యానించారు.

# అమరావతి ఒక్కటే రాజధాని..

మొదటి పేజీ తరువాయి

మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చలో శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించ లేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశించారన్నారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా.. ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలచుకుంటే బాధేస్తోంది. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక.. అమరావతిపై కక్ష కట్టారు. అమరావతి రైతులకు మద్దతుగా నేను వెళ్తే.. ముళ్ల కంచెలు వేశారు. వైకాపా హయాంలో శాసనసభ్యులకే రక్షణ లేకపోతే.. రైతులకు ఎలా ఉంటుంది? రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైకాపా హయాంలో హింసించారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. రాజధాని సమస్యను పరిష్కరించకపోగా.. కఠినం చేశారు. వైకాపా మళ్లీ వస్తే.. పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైకాపా మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనమంతా ఒకే మాటపై ఉండాలని అన్నారు. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు..దీనికి కట్టుబడి ఉన్నాం. చట్టసభల్లో కూర్చొని దాడులు చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేటప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారు. ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కయ్యారని ఆరోపించేవాళ్లు. రాజకీయ నేత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. దార్శనికుడు ఒక తరం గురించి ఆలోచిస్తాడని పవన్ అన్నారు.

# జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం : పేర్ని నాని

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ తీర్మానంతో చట్టబద్ధత ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు కేవలం జగన్‌ను తిట్టడానికే సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు.

నిజానికి జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగిందని, ఆయనకు రాజధానిపై కోపం ఉంటే తాడేపల్లిలో ఇల్లు ఎందుకు కట్టుకుంటారని నాని నిలదీశారు. అమరావతిలో



పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజధానిపైనే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు వంటి అంశాలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. అప్పుడే ప్రభుత్వానికి రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉందని నమ్ముతామని స్పష్టం చేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888
ఆదివారం 29 మార్చి 2026

# తిరుమల గిరి ఫేస్ - 6 అనధికార లేఅవుట్
# ప్లాట్లు కొనొద్దని హెచ్చరిక

**లక్ష్మీపురం సర్వే నం. 696లో అక్రమ లేఅవుట్**

**- మౌలిక సదుపాయాలు ఉండవని కమిషనర్ పి. విశ్వనాథ్ స్పష్టం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
కర్నూలు నగరంలోని లక్ష్మీపురం గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 696 (పి)లో 'తిరుమల గిరి ఫేస్ – 6' పేరుతో ఏర్పాటుచేసిన లేఅవుట్ అనధికారమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.
ఈ లేఅవుట్‌కు ఎల్ఆర్‌యస్–2020 పథకం కింద రియల్ ఎస్టేట్ యజమానులు దరఖాస్తు కూడా చేయలేదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఈ ప్రాంతంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించబడవని స్పష్టం చేశారు.
కాబట్టి నగర ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని కమిషనర్ సూచించారు.

## వైయస్సార్ స్మృతివనం దగ్గర అదుపుతప్పి
# టిప్పర్ బోల్తా-డ్రైవర్ కు స్వల్ప గాయాలు.




**పాములపాడు మార్చి 28 రిపబ్లిక్ న్యూస్:-** పాములపాడు మండలంలోని, భానుముక్కల గ్రామ పొలిమేరలో ఉన్న కంకర క్రసర్ మిషన్ దగ్గరకి వస్తూ ఏపీ 39/హెచ్ సి 8593 నెంబరు గల టిప్పర్ వైయస్సార్ స్మృతివనం దగ్గర అదుపుతప్పి బోల్తాపడడం జరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడడం జరిగింది.

# నేమకల్ గ్రామంలో సీతారాముల రథోత్సవం



**చిప్పగిరి, మార్చి , 28,(రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం నేమకల్ గ్రామం నందు శనివారం సీతారాముల రథోత్సవం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది, వేద పండితులు బెల్డోన రామనాథ స్వామి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు ,అభిషేకాలు, నిర్వహించారు, సాయంత్రం వీధుల గుండా జనవాహిని మధ్య భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణ రథోత్సవం జరిగింది, యువకులు రంగులు వేసుకొని నృత్యం, భజన కార్యక్రమాలు నిర్వహించారు, సీతారాముల ఆలయం నుండి ఆంజనేయ స్వామి ఆలయం వరకు రథోత్సవం జరిగింది, అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు, చిప్పగిరి ఎస్ఐ సివి నరసింహులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మిట్టకందాల గ్రామ పంచాయితీ అభివృద్దే మా ముఖ్య ధ్యేయం

**- టిడిపి మండల ప్రధాన కార్యదర్శి & మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్.**



**పాములపాడు మార్చి 28 రిపబ్లిక్ న్యూస్:-** మిట్టకందాల గ్రామ పంచాయతీ అభివృద్దే మా ముఖ్య ధ్యేయం అని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జి.హరిప్రసాద్ యాదవ్ అన్నారు. పాములపాడు మండలంలోని, మిట్టకందాల గ్రామంలో సి.సి. రోడ్డుకు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి & మాజీ గ్రామ సర్పంచ్ జి.హరి ప్రసాద్ యాదవ్ నాయకులతో కలిసి భూమి పూజ చేసి, పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయన్నారు. నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర.శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త.జయసూర్య ల సహకారంతో దాదాపు 45 లక్షల వ్యయంతో, 7 సీ.సీ.రోడ్లను వేయడం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధిలో అందరితో కలిసి పనిచేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి బూత్ ఇన్చార్జి ఎల్.శివరాముడు, నాయకులు ఎల్.సురేష్, కోడుమూరు శీను, శేఖర్, రమణారెడ్డి, దేవరాజు, కే.శీను, ఎల్.అఖిల్, కృష్ణన్న, వడ్డే మధు, గౌండ మద్దిలేటి, హరి ప్రసాద్, శీను, వెంకటేశ్వర్లు, నాగన్న, తదితరులు పాల్గొనడం జరిగింది.

# పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు



**చౌడేపల్లి ప్రతినిధి**
**మార్చి 28 రిపబ్లిక్ న్యూస్**
మండల కేంద్రమైన చౌడేపల్లిలో పారిశుధ్య చర్యలను చేపట్టారు డిప్యూటీ ఎంపీడీవో ఎస్ ఏ గఫూర్ ఆధ్వర్యంలో పట్టణంలోని గోసల కురపల్లి బీసీ కాలనీ పట్టణ శివారు ప్రాంతాలలో పూడిపోయిన కాలువలు చెత్తాచెదారాన్ని తొలగించారు. ఇళ్ల మధ్యలో పారి శుధ్యాన్ని పాటించాలని కాలువలలో వ్యర్థ పదార్థాలు వేయరాదని డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ స్థానికులకు సూచించారు ఉదయాన్నే ఇళ్ల వద్దకు వచ్చే పంచాయతీ బండ్లలో తడి చెత్త పొడి చెత్తను వేయాలన్నారు వ్యక్తిగత శుభ్రత పాటించి అంటువ్యాధులకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో "డ్రగ్స్ వద్దు బ్రో" పోస్టర్ల ఆవిష్కరణ

**యువతకు ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ హెచ్చరికడ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు**

**849 హాట్ స్పాట్స్ గుర్తింపు -పిఐటి చట్టం కింద అరెస్టులు - సమాచారం కోసం టోల్ ఫ్రీ 1972**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని, సమిష్టి కృషితో మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలిద్దామని ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ఐపీఎస్ పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన "డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చారు.
ఈ సందర్భంగా "డ్రగ్స్ మిమ్మల్ని మాత్రమే కాదు, మీ కుటుంబాలను కూడా నాశనం చేస్తాయి", "బాల్యాన్ని బలి తీసుకుంటున్న మత్తు పదార్థాలు" వంటి సందేశాలతో పోస్టర్లను ఆవిష్కరించారు.
రాష్ట్ర ప్రభుత్వం "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి, 70 లక్షల మంది విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. దేశ భద్రత, వ్యక్తిగత ఆరోగ్యం దృష్ట్యా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు సూచించారు.
డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఆపరేషన్ వజ్రప్రహార్, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్, ఆపరేషన్ చైతన్యం వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా గంజాయి సాగు, అక్రమ రవాణా అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాలను పొగాకు రహిత ప్రాంతాలుగా మార్చేందుకు కృషి జరుగుతోందన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా 849 డ్రగ్స్ హాట్ స్పాట్స్‌ను గుర్తించి, డ్రోన్ సర్వేలెన్స్, కార్డన్ సెర్చ్ ఆపరేషన్లతో నిఘా పెంచినట్లు తెలిపారు. గత 12 సంవత్సరాల డేటాతో నార్కోటిక్ నేరస్తులపై ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.
పిఐటి చట్టం కింద ఇప్పటివరకు 101 మందిని జైలుకు పంపించామని, మరో 200 మందిపై చర్యల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. డ్రగ్స్ వ్యాపారులకు గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, ఎన్డిపిఎస్ చట్టం కింద ఆస్తులను జప్తు చేస్తామని స్పష్టం చేశారు.



ఎక్కడైనా గంజాయి సాగు, డ్రగ్స్ అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన విద్యార్థులు, ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు, డ్రగ్స్ ఎడి హరి హర తేజ, కళాశాల ప్రిన్సిపల్ వీర భద్ర రెడ్డి, డీన్ దేవకి, సిఐ తేజమూర్తి, సిఐ ప్రసాద్, ఎస్సై సుజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కర్నూలులో "ఆపరేషన్ వజ్రప్రహార్" కింద మెగా కార్డన్ సెర్చ్

**52 వాహనాలు స్వాధీనం**

**-జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు**

**41 లిక్కర్ బాటిళ్లు సీజ్,**

**డ్రగ్స్ నిర్మూలనపై పోలీసుల కట్టుదిట్ట చర్యలు**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
కర్నూలు జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ కట్టుదిట్ట చర్యలు చేపట్టింది. "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా శనివారం మెగా కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు, ఈగల్ ఐజి పర్యవేక్షణలో, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.
జిల్లాలోని పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు సబ్ డివిజన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. హోలగుంద, మంత్రాలయం, చిన్న పెండెకల్ గ్రామం, కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలలో ప్రత్యేకంగా కార్డన్ సెర్చ్‌లు నిర్వహించారు.
ఈ ఆపరేషన్‌లో మొత్తం 196 మంది పోలీసు సిబ్బంది పాల్గొని, 350 మంది వ్యక్తులను తనిఖీ చేశారు. అలాగే 50 అనుమానితుల ఇళ్లను పరిశీలించారు. 77 వాహనాలను చెక్ చేయగా, సరైన పత్రాలు లేని 52 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో 41 లిక్కర్ బాటిళ్లను సీజ్ చేశారు.
పోలీసులు ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని హెచ్చరించారు.
ప్రజలు తమ పరిసరాల్లో డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా డ్రగ్స్ వ్యతిరేకంగా పోలీసు సిబ్బంది, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రజల సహకారం కీలకమని అధికారులు పేర్కొన్నారు.ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల సహకారంతో డ్రగ్స్ ఫ్రీ సమాజం నిర్మాణమే లక్ష్యమని పోలీసు శాఖ స్పష్టం చేసింది.





# ఘనంగా వైసీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు






**అనంతపురం సంక్షేమం,మార్చి 28, (రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం నగరంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ట్రేడ్ యూనియన్ జిల్లా, నగర అధ్యక్షులు ఓబిరెడ్డి, మార్కెట్ ఖాజా ఆధ్వర్యంలో జరిగాయి.ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. పార్టీ నినాదాలతో కార్యాలయ ప్రాంగణం మార్మోగింది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ట్రేడ్ యూనియన్ పనిచేస్తుందని నాయకులు తెలిపారు. ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. కార్యకర్తలు భారీగా పాల్గొని ఐక్యతను ప్రదర్శించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహంగా కొనసాగింది.ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్పర్సన్ బి.గిరిజమ్మ, మాజీ మేయర్ వసీం, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కొర్రపాడు హుసేన్ పీరా, రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్మికుల సంక్షేమం పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ట్రేడ్ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకి కార్మిక వర్గం అండగా నిలుస్తుందని తెలిపారు.

**రాష్ట్ర విభజన అనంతరం కార్మికుల పక్షాన నిలబడిన పార్టీ**
ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అనే పేరులోనే శ్రామిక శక్తి ఉందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ట్రేడ్ యూనియన్ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా కార్మికుల పక్షాన పార్టీ నిలిచిందన్నారు. కార్మికుల హక్కుల సాధనలో ట్రేడ్ యూనియన్ కీలక పాత్ర పోషించిందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పార్టీ ముందుంటుందని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని సూచించారు.
2019లో వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్మికుల సంక్షేమానికి పలు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆశ వర్కర్ల వేతనాలను భారీగా పెంచి, డ్వాక్రా యానిమేటర్లు, బుక్ కీపర్లకు గౌరవ వేతనం అందించామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచి వారికి ఆర్థిక భరోసా కల్పించామన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించామని చెప్పారు. కార్మిక సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కార్మిక వర్గానికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల కోసం ట్రేడ్ యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగేలా పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. పార్టీకి కార్మిక వర్గం బలమైన శక్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్మికుడి సమస్యను పార్టీ సమస్యగా తీసుకుంటామని తెలిపారు. కార్మిక సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

# మానవీయతకు ప్రతిబింబం





## సీనియర్ నాయకుడికి ఘన నివాళులు

**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 28, శింగనమల**

శింగనమల మండలానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, నాయన వారి పల్లి మాజీ సర్పంచ్ గుత్తా నరసయ్య మరణం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామానికి చేరుకుని నివాళులు అర్పించారు. మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు నరసయ్య సేవలను స్మరించుకున్నారు.

### ఆయన జీవితం ప్రజాసేవకే అంకితం

గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ నిలిచిపోతుందని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టం వెంకటేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నర్సా నాయుడు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు మృతదేహం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని, నరసయ్య కుటుంబానికి ధైర్యం చెప్పి సానుభూతి తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, సహచర నాయకులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నరసయ్య సాధారణ నాయకుడిగా కాకుండా గ్రామానికి అండగా నిలిచిన మానవతా నాయకుడిగా గుర్తింపు పొందారని స్థానికులు పేర్కొన్నారు. ప్రతి సమస్యను తనదిగా భావించి పరిష్కరించేందుకు కృషి చేసేవారని చెప్పారు. ఆయన మరణం గ్రామానికి పెద్ద నష్టం అని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయనతో ఉన్న అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. నరసయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని, గ్రామాభివృద్ధిలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.

### ప్రజలతో మమేకమై జీవించిన మంచి మనిషి

నాయనవారిపల్లి గ్రామానికి చెందిన గుత్తా నరసయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వైకుంఠం ప్రభాకర్ చౌదరి గ్రామానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తా నరసయ్య గ్రామంలో మంచి పేరు సంపాదించిన వ్యక్తి అని, ఆయన మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై జీవించిన మంచి మనిషిని కోల్పోయామని అన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నరసయ్య చేసిన సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. ఆయన ఆశయాలను కుటుంబ సభ్యులు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని నివాళులు అర్పించారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గుత్తా నరసయ్య ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ప్రార్థించారు.

# దొంగలించబడ్డ సొత్తు లభ్యం



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 28 రిపబ్లిక్ న్యూస్**

దొంగలించబడ్డ సొత్తు లభ్యం కావడంతో స్వామివారి మహిమగా భావించి పూజలు చేసిన సంఘటన రాజనాల మండపై చోటుచేసుకుంది మదనపల్లి బసినికొండ కు చెందిన
ఒక రూమ్ లో 12 మంది కలసి ఉండేవారు. వారు అందరూ కలసి చెట్లు కోసేవారు. గురువారం రాత్రి చెట్లు కోసే మిషన్ సుమారు 50,000/- విలువగలది. దొంగలించబడినది. ఐతే శుక్రవారం రోజంన ఉదయాన్నే రాజనాల బండ ఆంజనేయ స్వామి దేవస్థానం లో సత్య ప్రమాణం చేయడానికి రసీదు తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం మిషన్ రూములో ప్రత్యంక్షం అయ్యింది. శనివారం ఉదయం పూజలు చేసి తీసుకొని వెళ్ళారని దేవస్థాన ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి స్వామి తెలియజేశారు.

# పన్నుదారులకు గుడ్ న్యూస్
# పన్ను కౌంటర్ల పని వేళలు పెంపు

**ఉదయం 7 నుంచి రాత్రి 8 వరకు సేవలు 50% వడ్డీ రాయితీ వినియోగించుకోవాలని కమిషనర్ పిలుపు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**



నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయడంతో పాటు పన్నుదారులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, పన్ను చెల్లింపుల కోసం వచ్చే ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని పన్ను వసూళ్ల కౌంటర్ల పని వేళలను ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పొడిగిస్తూ కమిషనర్ పి. విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.కౌంటర్ల వద్దకు వచ్చిన ప్రతి పన్నుదారుడు తన చెల్లింపు ప్రక్రియ పూర్తి చేసుకునే వరకు సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం అధికారులను షిఫ్ట్‌ల వారీగా విధుల్లో నియమించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీని పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.పొడిగించిన పని వేళలు వెంకటరమణ కాలనీ నగరపాలక కార్యాలయం పన్ను వసూలు కేంద్రంతో పాటు దండిగేరి, పెద్దపడఖాప 20,21వ సచివాలయాలు, కేఎంసి పాత కార్యాలయం, బి.క్యాంపు, అరోరా నగర్ 56,57వ సచివాలయాలు, గురు రాఘవేంద్ర నగర్, రాజీవ్ గృహకల్ప 92,93వ సచివాలయాలు, కల్లూరు వార్డు కార్యాలయం 84,85వ సచివాలయాలు, లక్ష్మీనగర్, జెఎన్ఆర్ నగర్ 61,62వ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో అమల్లో ఉంటాయని తెలిపారు.

# టెక్నాలజీతో పోలీసింగ్‌కు కొత్త దిశ

**ఏఐ హ్యాకథాన్ 2026 ప్రత్యేకత -ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ పి.జగదీష్**








**రిపబ్లిక్ క్రైమ్, ఉమ్మడి అనంతపురం జిల్లా**

మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్ వ్యవస్థ కూడా సాంకేతికత వైపు వేగంగా అడుగులు వేస్తోంది. నేర నియంత్రణ, ప్రజల భద్రత, పరిపాలన సులభతరం వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషించబోతోంది. ఈ దిశగా అనంతపురం జిల్లా పోలీసులు చేపట్టిన "అనంతపురం పోలీస్ ఏఐ హ్యాకథాన్ 2026" ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. యువత ఆలోచన విధానాలను అనుసరించేందుకు పోలీసింగ్ వ్యవస్థ ఒక నిర్దిష్ట లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం.

### పరిష్కారాలు చూపే ఆవిష్కరణలు చేయాలి

ఈ హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ టెక్నాలజీ ఒక శక్తివంతమైన ఆయుధమని, దాన్ని ప్రజల భద్రత కోసం ఉపయోగించినప్పుడే దాని అసలైన విలువ బయటపడుతుందని తెలిపారు. కేవలం ఉద్యోగాల కోసం చదవడం కాదు, సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే ఆవిష్కరణలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ హ్యాకథాన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1000 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ కార్యక్రమంపై ఆసక్తిని చూపి నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా డ్యూటీ రోస్టర్ జనరేటర్, బహుభాషా ఫిర్యాదు పోర్టల్, చేతిరాత పత్రాలను గుర్తించే ఏఐ ఓసీఆర్ సిస్టమ్, పోలీస్ డేటా మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించారన్నారు. ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొన్న బృందాలలో ఉత్తమంగా నిలిచిన 40 బృందాలను గ్రాండ్ ఫినాలేకు ఎంపిక చేశారు.

### యువత ఆలోచనలు దేశభద్రతలో భాగం కావాలి

పోలీసింగ్‌లో ఏఐ వినియోగం పెరిగితే ఫిర్యాదుల పరిష్కారం వేగంగా, నేరాల విశ్లేషణ సులభమవుతుందన్నారు. డ్యూటీ నిర్వహణ పారదర్శకంగా, ప్రజలకు సేవలు త్వరగా అందుతాయని, భవిష్యత్ పోలీసింగ్ పూర్తిగా టెక్నాలజీ ఆధారంగా మారబోతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ హ్యాకథాన్ ద్వారా విద్యార్థుల ఆలోచనలు నేరుగా పోలీసింగ్ వ్యవస్థకు ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు."మీరు రాసే కోడ్ రేపు దేశ భద్రతలో భాగం కావచ్చు" అనే సందేశాన్ని పోలీసుల ద్వారా యువతకు అందించారు. సాధారణంగా హ్యాకథాన్‌లు ఐటీ కంపెనీలు నిర్వహిస్తుంటాయి, కానీ పోలీస్ శాఖ ద్వారా నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచింది. సాంకేతిక వినియోగానికి పోలీస్ శాఖలో కొత్త దారులు చూపించిందని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా టెక్నాలజీ, యువత ఆలోచనలు, పోలీసింగ్ వ్యవస్థ ఈ మూడు కలిస్తే భవిష్యత్ భద్రతా వ్యవస్థ మరింత బలపడుతుందని స్పష్టంగా హ్యాకథాన్




నిరూపించింది.జిల్లా పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే కాకుండా దేశ స్థాయిలో కూడా ఆదర్శంగా నిలిచే అవకాశముంది. మీ ఆలోచనలు రేపు దేశ భద్రతలో భాగం కావాలని ఆకాక్షించారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి శ్రీ అశ్విన్ మణిదీప్, ఇన్ క్రక్స్ ఏఐ ప్రతినిధులు యశ్వంత్ , కీర్తిరాజు, సైబర్ విభాగం సి.ఐ షేక్ జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం

**రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం : ఎంపీ బస్తిపాటి నాగరాజు**

**పంచలింగాలలో ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీల ప్రారంభం రైతులకు పలు సంక్షేమ పథకాలపై హామీ**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో నిర్వహించిన ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రారంభించారు. శ్రీ కోదండ రామ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించి వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం "అన్నదాత సుఖీభవ", "పీఎం కిసాన్" వంటి పథకాల ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నదని తెలిపారు. అలాగే మద్దతు ధరతో పంట కొనుగోలు, సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ, రద్దు చేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ వంటి చర్యలతో రైతుల ప్రయోజనాలను కాపాడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభాకర్ రెడ్డికి ఎస్.ఈ గా పదోన్నతి

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



పంచాయతీరాజ్ ఎస్ ఈ గా పదోన్నతి పొందిన ప్రభాకర్ రెడ్డి ( ఫైల్ ఫోటో ):

**అనంతపురం రామ్ నగర్,మార్చి 28,( రిపబ్లిక్ న్యూస్ ):**

నగరంలో పంచాయతీరాజ్ శాఖ పీ.ఆర్.ఐ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఎస్.ఈ)గా పని చేస్తున్న జి.ప్రభాకర్ రెడ్డికి సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్.ఈ)గా పదోన్నతి లభించింది.ఆయన్ను కర్నూలు జిల్లా పీ.ఆర్. సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్.ఈ)గా నియమించారు.ఈ మేరకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31న ఆయన ఈఈ బాధ్యతల నుంచి రిలీవ్ అయి, ఏప్రిల్ ఒకటిన కర్నూలు ఎస్.ఈ గా బాధ్యతలు చేపడతారని సమాచారం. విధి నిర్వహణలో ముక్కుసూటిగా పని చేస్తూ.. సౌమ్యుడిగా, మృదు స్వభావిగా, సమర్థవంతమైన అధికారిగా ప్రభాకర్ రెడ్డి గుర్తింపు పొందారు. ఈఈగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన పరిధిలో ఏ ఒక్క పనీ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయించి, అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల మన్ననలు పొందారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం.. పదోన్నతి కల్పించి కర్నూలు ఎస్.ఈగా అవకాశం కల్పించారు.కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న ఎస్.ఈ ప్రభాకర్ రెడ్డికి పీఆర్ అనంతపురం సబ్ డివిజన్ -1, 2 డీఈఈలు కె.లక్ష్మీనారాయణ, జింకల కృష్ణజ్యోతి, క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈలు లోకన్న, గోపాల్ నాయక్ అభినందనలు తెలిపారు.

**ఎర్త్ అవర్ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నన్నూరులో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు**


# సి.మద్దులేటి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం






**ఓర్వకల్లు ప్రతినిధి మార్చి 28,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఇంచార్జిప్రధానోపాధ్యాయులు మద్దులేటి మాట్లాడుతూ ప్రతీ ఇంట్లో అనవసరమైన విద్యుత్ దీపాలను, ఉపకరణాలను ఆపివేయ వలెనని .కేవలం ఈ ఒక్క గంటే కాకుండా, నిత్య జీవితంలో కూడా విద్యుత్తును వృథా చేయకుండా పొదుపుగా వాడ వలెనని .పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించ వలెనని , వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రకృతి వనరులను కాపాడుకోవడమే



కాకుండా, మన తోటి వారికి, మిత్రులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించి భూతాపాన్ని తగ్గించడానికి కృషి చేస్తూ, రాబోయే తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన భూమిని అందించడానికి కట్టుబడి ఉండాలని తెలియజేశారు.28 వ తేదీ అనగా శనివారం రోజున రాత్రి 8.30-9.30 గంటలకు వన్ హౌర్ లైట్స్ ఆపి ఉంచవలెనని జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు లింగ స్వామి ఎర్త్ అవర్ గురించి విషదీకరించారు.అనంతరం ఎర్త్ అవర్ పర్యావరణ పరిరక్షణ కొరకై ప్రతిజ్ఞను విద్యార్థులచే చేయించడమైనది. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రవీంద్రా రెడ్డి, మెహెతాబ్ హుస్సేన్ లలిత కుమారి, అబీద బేగం, రామకృష్ణ,వెంకటేశ్వర్లు,రాజీవ కుమారి, నాగరాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888
ఆదివారం 29 మార్చి 2026

# డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే మన లక్ష్యం

- జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ
- పాఠశాలల వద్ద ప్రత్యేక నిఘా
- 'ఈగిల్' నిఘా నీడలో డ్రగ్స్ నెట్‌వర్క్..
- ఒడిశా ముఠాల గుట్టురట్టు..
- 112 మంది అనుమానితులపై డేగ కన్ను..
- సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1972ను వినియోగించాలని హితువు..




**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 24 - (రిపబ్లిక్ న్యూస్) -** అన్నమయ్య జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏకమై కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మరియు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పిలుపు నిచ్చారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఐఏఎస్ అధ్యక్షతన నిర్వహించిన చీజూ=ణ (నేషనల్ నారకోటిక్స్ కో ఆర్డినేషన్ ) జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పాల్గొన్నారు. ఆయనకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాల పట్ల పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారని దీనికి వారందరికీ అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ముఖ్యంగా ఒడిశా రాష్ట్రం నుండి డ్రగ్స్ సరఫరా చేస్తున్న నెట్‌వర్క్‌ను ఇప్పటికే సమర్థవంతంగా ఛేదించినట్లు వివరించారు. జిల్లాలో గుర్తించిన 112 మంది అనుమానితులపై నిరంతర నిఘా ఉంచడమే కాకుండా, వారికి కౌన్సిలింగ్ ఇస్తూ రికార్డులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యువతను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని విక్రయించే కూల్ లిప్, నిషేధిత పొగాకు ఉత్పత్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. పాఠశాలల పరిసరాల్లో కూల్ డ్రింక్ షాపులు, చిన్న తరహా కొట్టులపై నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆయా స్టేషన్ పరిధిలోని పోలీసులను కోరారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ విద్యాసంస్థల 100 మీటర్ల పరిధిలో పొగాకు అమ్మకాలు జరగకుండా విద్యాశాఖ అధికారులు, టీచర్లు పర్యవేక్షించాలని కాలేజీ యువతలో అవగాహన కల్పించేందుకు 'ఈగిల్ క్లబ్స్'ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల నిర్వహణ కమిటీలు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించా లన్నారు. పాఠశాల సమయాల్లో మాత్రమే కాకుండా, స్కూల్ అవర్స్ ముగిసిన తరువాత కూడా విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు బాధ్యతతో పర్యవేక్షణ కొనసాగించాలని యూనిఫార్మ్‌లో ఉన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు గమనించినట్లయితే, వారిని కౌన్సిలింగ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని తరగతి బోధనతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, మంచి అలవాట్ల పెంపుదలపై కూడా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్' కింద నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, అనధికార వాహనాలు మరియు మైనర్లు నడిపే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. మదనపల్లిలోని సర్వోదయ డీ – అడిక్షన్ సెంటర్ ద్వారా వ్యసనాలకు గురైన వారికి అండగా నిలుస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అన్నమయ్య జిల్లా లోని




ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవర్లు మరియు కండక్టర్లు బస్సుల ద్వారా ప్రయాణించే ప్రయాణికుల లగేజిని క్రమం తప్పకుండా పరిశీలించాలని, అనుమానా స్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. "డ్రగ్స్ మహమ్మారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972 (ఈగల్) కు కాల్ చేయండని సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచబడతాయని జిల్లా యంత్రాంగం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అనంతరం డ్రగ్స్ గంజాయి నేరం, డ్రగ్స్ వద్దు స్కిల్స్ ముద్దు, డ్రగ్స్ వద్దు బ్రో, వివిధ రకాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ తదితరులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి, డీఈవో, జిల్లా అటవీ శాఖ అధికారి, డీఎస్పీ, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యాశాఖాధికారులు, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# సరస్వతీ పుత్రుడు పుట్టపర్తి నారాయణాచార్యులకు ఘన నివాళులు

**జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ**

**-సాహిత్య సేవలను కొనియాడిన అధికారులు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)** పద్మశ్రీ అవార్డు గ్రహీత, సరస్వతీ పుత్రుడు డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల జన్మదినాన్ని పురస్కరించుకుని కర్నూలు కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ ఆయనను "సరస్వతీ పుత్రుడు"గా అభివర్ణిస్తూ ఆయన సాహిత్య కృషిని ప్రశంసించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్ఓ మాట్లాడుతూ, పుట్టపర్తి నారాయణాచార్యులు కవిగా, పండితునిగా, అవధానిగా, విమర్శకునిగా, వక్తగా, అనువాదకునిగా, వాగ్గేయకారునిగా అనేక రంగాల్లో విశిష్ట సేవలు అందించారని తెలిపారు. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక తారాజువ్వలాంటివారని పేర్కొన్నారు. ఆయన రచించిన "శివతాండవం"లో పదాల శక్తి, భావాల లోతు విశేషమని, ఆ కాలంలోనే ఎంతో ప్రశంసలు పొందిందని వివరించారు. హృషికేశ్‌లో స్వామి శివానంద సరస్వతి ఆయనకు "సరస్వతీ పుత్ర" బిరుదును ప్రదానం చేసిన విషయం గుర్తుచేశారు. భారత ప్రభుత్వం ఆయనను "పద్మశ్రీ"తో సత్కరించిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో సెట్ కూర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, పుట్టపర్తి నారాయణాచార్యులు 1914 మార్చి 28న అనంతపురం జిల్లాలోని చియ్యేడు గ్రామంలో జన్మించారని తెలిపారు. చిన్న వయస్సులోనే రామాయణం, మహాభారతం, భాగవతం వంటి ఇతిహాసాలను అవగాహన చేసుకున్నారని, సంగీతం, నాట్య కళల్లో కూడా ప్రావీణ్యం సాధించారని చెప్పారు. 12 ఏళ్ల వయస్సులోనే "పెనుగొండ లక్ష్మి" అనే పద్యకావ్యం రచించారని, 15 భాషల్లో పాండిత్యం సంపాదించిన బహుభాషా కోవిదుడని కొనియాడారు. "శివతాండవం" ఆయనకు అపార ఖ్యాతి తెచ్చిందని పేర్కొన్నారు.

జిల్లా టూరిజం అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఆయన రచించిన "పెనుగొండ లక్ష్మి", "మేఘదూతం", "షాజీ", "గాంధీ ప్రస్థానం", "క్రాంతి సందేశం" వంటి గ్రంథాలు విశేష ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. సంస్కృతంలో "త్యాగరాజ స్వామి సుప్రభాతం", ఆంగ్లంలో "లీవ్ ఇన్ ది విండ్", "ది హీరో" వంటి రచనలు ప్రసిద్ధి చెందినట్లు పేర్కొన్నారు.

పర్షియన్ భాషలో కూడా ప్రావీణ్యం కలిగిన ఆయన, కడపలోని శ్రీ రామకృష్ణ హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా సేవలందించి పదవీ విరమణ పొందారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్, సెట్ కూర్, టూరిజం శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా జరిగిన రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి



**కల్లూరు ప్రతినిధి, మార్చి 28,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా జరిగిన రథోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి దర్శించుకున్నారు. అనంతరం రథోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి ఊరేగింపును విజయవంతం చేశారు, ధార్మిక కార్యక్రమాల పట్ల కాటసాని రామభూపాల్ రెడ్డి విశ్వాసం, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం మరోసారి స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల నాయకులు, వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ విభాగాలలో వివిధ హోదాల్లో ఉన్నవారు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# కుందనగుర్తి గ్రామంలో ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్







**చిప్పగిరి, మార్చి, 28, (రిపబ్లిక్ న్యూస్ )** శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని కుందనగుర్తి గ్రామంలో గ్రామ యువత మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను విజయవంతంగా నడిపించారు. ఈ నెల 22వ తేదీన ప్రారంభమైన ఈ పోటీల్లో మండలానికి చెందిన పలు గ్రామాల నుండి మొత్తం 15 జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కుందనగర్తి గ్రామానికి చెందిన కేడివై హిటర్స్ మరియు చిప్పగిరి జట్టు నాకౌట్ లెవన్స్ తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలో కేడివై హిటర్స్ జట్టు విజయం సాధించింది. బహుమతులు ప్రధానం చేయడానికి ముఖ్య అతిథులుగా బిల్లోన సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, చిప్పగిరి గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు, విజయ విటల పాఠశాల యాజమాన్యం యూసుఫ్,చంద్రమోహన్ లు పాల్గొన్నారు. మొదటి బహుమతి స్పాన్సర్ టిడిపి మండల కన్వీనర్,గ్రామ సర్పంచ్ కొండా పురుషోత్తం కెప్టెన్ విజయ్ కు రూ.10,000 రూపాయలు అందజేశారు. ద్వితీయ బహుమతి స్పాన్సర్ విజయ విఠల పాఠశాల యాజమాన్యం కే.యూసుఫ్, కే.చంద్రమోహన్ లు చిప్పగిరి గ్రామానికి చెందిన నాకోట్ లెవెల్స్ జట్టుకు రూ.5,000 రూపాయలను కెప్టెన్ జగన్ కు అందజేశారు. ఈ సందర్భంగ ఆర్గనైజర్లను స్పాన్సర్లు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండా పురుషోత్తం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడమే కాకుండా ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ స్వామి, బోగేస్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# హుసేనాపురంలో శ్రీ ఆంజనేయ స్వామి శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే





**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 28,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామం బైరెడ్డి నగర్ లో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం శ్రీ భ్రమరాంబ బుగ్గరామేశ్వర స్వామి (కాల్వబుగ్గ) ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్న వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండలం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆస్తి కోసం కన్నతల్లిని చంపిన నిందితుడు అరెస్ట్



**అవుకు, మార్చి 28 (పరిపబ్లిక్ న్యూస్)** జల్సాలకు బానిసై, ఆస్తి వివాదంతో కన్నతల్లిని కట్టెతో కొట్టి చంపిన కుమారుడిని అవుకు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. బనగానపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీ. మంజునాథ రెడ్డి తెలిపిన వివరాల మేరకు..అవుకు కోట వీధికి చెందిన పుసులూరు రామాంజనేయులు (24) అనే యువకుడు మద్యానికి, ఇతర చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేశాడు. తన అప్పులు తీర్చేందుకు ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని తల్లిదండ్రులతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన (ఉగాది పండుగ రోజు) మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో నిందితుడు మళ్లీ గొడవకు దిగాడు. వాగ్వాదం పెరగడంతో ఆవేశంలో తండ్రిపై రాయి, కట్టెతో దాడి చేశాడు. భర్తను కాపాడబోయిన తల్లి పుసులూరు లక్ష్మీదేవి (45) పై రామాంజనేయులు కట్టెతో బలంగా తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 22న మృతి చెందారు. దీంతో పోలీసులు దీనిని హత్య కేసుగా నమోదు చేశారు. శనివారం ఉదయం అవుకు మండలం మెట్టుపల్లి రోడ్డులోని చిన్న చెరువు కట్ట సమీపంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకోవడంతో అతనిని రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుడిపై గతంలోనూ దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును ఛేదించిన బనగానపల్లి జు× మంజునాథ రెడ్డి, అవుకు ూ× అశోక్, సిబ్బంది శివకుమార్, చంద్రలను నంద్యాల జిల్లా ూా సునీల్ షెరాన్ డోన్ ఖూ్రా. శ్రీనివాసులు అభినందించారు.

# మహానందిలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పూజలు



**మహానంది, మార్చి 28 ,( రిపబ్లిక్ న్యూస్)** మహానందీశ్వర స్వామి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ శనివారం రాత్రి పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన ఆయనకు మహానంది మండల ఆర్యవైశ్య సంఘం నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు. కార్యక్రమంలో మహానంది మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు గంగిశెట్టి జనార్దన్ రావు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# విజయవాడలో దారుణం

## ఆటోలో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారం

**విజయవాడ,మార్చి 28:** దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. ఎక్కడో ఒకచోట మృగాళ్లు కాచుకునే ఉంటున్నారు. ఏదో ఒక చోట వారిపై కామాంధులు లైంగిక దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. చిన్న, పెద్ద, వృద్ధులు అనే తేడా లేకుండా రెచ్చిపోతున్నారు. ఒంటరిగా చిక్కితే పాపం.. అత్యాచారాలకు తెగపడుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి విజయవాడలో జరిగింది. ఆటో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి వెళ్లాల్సిన ప్రాంతానికి కాకుండా బలవంతంగా కృష్ణలంక వైపునకు తీసుకెళ్లాడు కామాంధుడు. భయభ్రాంతులకు గురి చేసి ఎవరూ లేని ప్రదేశానికి లాక్కెళ్లాడు. అనంతరం యువతిపై అత్యాచారానికి ఒడికట్టాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలిపెట్టి ఆటోతో సహా పరారయ్యాడు. ఏడుస్తూ ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లికి చెప్పింది. షాక్‌కు గురైన బాధిత కుటుంబం మాచవరం పోలీసులను ఆశ్రయించారు. తనపై జరిగిన లైంగిక దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆటో డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,మార్చి 28** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ 24 క్యారెట్ల పసిడి ధర 4,492 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఔన్స్ వెండి ధర 69 డాలర్లుగా ఉంది.

# ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు నష్టం లేకుండా చర్యలు

**కలెక్టర్ డా. ఏ. సిరి**

**ఉద్యాన పంటలకు ప్రోత్సాహం**

**ఎఫ్‌పీఓల విస్తరణపై దృష్టి**

**పశుపోషణ, మిశ్రమ పంటలతో రైతుల ఆదాయం పెంపు లక్ష్యం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
ఎల్నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, మైక్రో ఇరిగేషన్, సెరికల్చర్ అధికారులతో కలిసి వేసవి కాలంలో పంటల రక్షణ, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నిరంతర ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యాన పంటల సాగును పెంచడం, మిశ్రమ పంటలను ప్రోత్సహించడం, ఎఫ్‌పీఓల సభ్యత్వాన్ని విస్తరించడం అవసరమని తెలిపారు. ఉల్లి సాగు తగ్గించి మల్లెపూల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు పాలిచ్చే పశువులు, మేకలు, గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించాలని, పశువులకు అవసరమైన గడ్డి, దాణా సరఫరా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వేసవిలో పశువుల కోసం నీటి తొట్టెలను నింపే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి పొదుపు కోసం డ్రిప్ ఇరిగేషన్‌ను విస్తృతంగా అమలు చేయాలని, రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని అన్నారు. రైతులకు పంట రుణాలు, పశు రుణాలు అందించడంతో పాటు భూసార పరీక్షలు నిర్వహించి అనుకూల పంటల సాగుకు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు.
పంట ఉత్పత్తులకు గిడ్డంగులు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా రైతులు లాభాల దిశగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల వినియోగంతో వ్యవసాయ సేవలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తమ ప్రణాళికలను వివరించగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలి

**-ఈగల్ చీఫ్ ఐజీ ఏ.కే. రవికృష్ణ**

**కర్నూలులో ఈగల్ టీం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహణ**







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
కర్నూలు కలెక్టరేట్ సమీపంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు బ్లడ్ బ్యాంక్‌లో శనివారం ఈగల్ టీం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈగల్ చీఫ్ ఐజీ ఏ.కే. రవికృష్ణ ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కెవి సుబ్బారెడ్డి కళాశాలకు చెందిన 28 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే తలసేమియా రక్త మార్పిడి కేంద్రాన్ని ఐజీ పరిశీలించారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న 6 మంది పిల్లలకు రక్త మార్పిడి నిర్వహించారు. వేసవికాలంలో రక్తం కొరత అధికంగా ఉంటుందని, యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఐజీ పిలుపునిచ్చారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు జిల్లా శాఖ చైర్మన్ డా. కే.జి. గోవింద రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీమతి కె. అరుణ, ట్రెజరర్ ఐ. నరసింహ, కర్నూలు టు టౌన్ సీఐ నాగరాజారావు, కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్ యాదవ్, ఎం.జె. బాబు రాజు, కె.వి. సుబ్బారెడ్డి, మెడికల్ ఆఫీసర్లు బి. కుమారస్వామి రెడ్డి, జి. రామచంద్ర రావు, అలాగే కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులు అమానుషం

**నిందితులపై కఠిన చర్యలు తప్పవు: ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షం**

**ఆదోని పర్యటనలో ప్రజల వినతులు స్వీకరణ అట్రాసిటీస్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
దళితులపై జరుగుతున్న దాడులు అత్యంత హేయమైన, అమానుషమైన చర్యలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షం తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఘటనలను ప్రభుత్వం అసలు ఉపేక్షించదని, నిందితులపై చట్టపరమైన చర్యలతో పాటు శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.
శనివారం కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఆదోని పట్టణంలోని స్థానిక అతిథి గృహానికి విచ్చేసిన ఆయన, అక్కడ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా దళితుల సమస్యలు, భూమి వివాదాలు, సామాజిక వివక్ష, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై బాధితులు తమ ఫిర్యాదులను కమిషన్ సభ్యునికి వివరించారు.
ఈ సందర్భంగా మేకల బిక్షం మాట్లాడుతూ, దళితుల హక్కులను రక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని వేగవంతమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అధికార యంత్రాంగం దళితుల సమస్యలపై సున్నితంగా స్పందించి, వేగంగా చర్యలు చేపట్టాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జేమ్స్, సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, డీఎస్పీ భార్గవి, తహశీల్దార్ శేష ఫణి, రజనీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఇంచార్జి) వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జ్యోతికుమార్ నూతన ఉపకులపతిగా బాధ్యతల స్వీకణ

**సామాజిక న్యాయానికి సముచిత స్థానం**



**అనంతపురం ఎస్కేయూ, మార్చి 28,(రిపబ్లిక్ న్యూస్):**
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యా విధానంలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. శనివారం నూతన ఉపకులపతిగా ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పాదాభివందనం చేసి అనంతరం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్య కేవలం పుస్తకాల పరిధిలోనే కాదు, సమాజ మార్పుకు సాధనమని పేర్కొన్నారు. అందులో భాగంగా మహాత్మ పూలే విగ్రహానికి పాదాభివందనం చేసిన తొలి ఉపకులపతిగా ఆయన గుర్తింపు పొందారు. దీంతో యూనివర్సిటీలో సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా అవకాశాల విస్తరణరూపుదిద్దుకోనుంది. బడుగు బలహీన వర్గాల విద్యా అభివృద్ధి, సమాన అవకాశాలు, పరిశోధనాభివృద్ధి, యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తారని విద్యార్థులు, అధ్యాపకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీని విద్య, పరిశోధన, సామాజిక బాధ్యతల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే దిశగా కొత్త ఉపకులపతి ముందుకు సాగనున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ వెంకట్ నాయుడు, రిజిస్ట్రార్ రమేష్ నాయుడు, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప, బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.ఏ. లక్ష్మణరావు, యువజన సంఘం రాష్ట్ర నాయకులు జైపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై అభినందనలు తెలిపారు.

# జిజిహెచ్ లో ఘనంగా "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

**"జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్" లక్ష్యంగా అవగాహన ర్యాలీ, మొక్కల నాటకం ప్రజల్లో చైతన్యం**








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నేడు స్థానిక గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జిజిహెచ్)లో ఘనంగా జరిగింది. ఈ నెల థీమ్ అయిన "జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్"పై ప్రత్యేక దృష్టి సారిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆసుపత్రి క్యాజువల్టీ విభాగం నుంచి గైనెక్ వార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొని "మన చెత్త – మన బాధ్యత" వంటి నినాదాలతో రోగులు, వారి సహాయకుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం గైనెక్ వార్డు ప్రాంగణంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా, ఆహ్లాదకరంగా మార్చాలన్న లక్ష్యంతో ఈ చర్యలు తీసుకున్నారు. అలాగే ఎమర్జెన్సీ వార్డు ముందు తడి చెత్త, పొడి చెత్త, బయో–మెడికల్ వ్యర్థాలను వేర్వేరు రంగుల డబ్బాల్లో వేయాల్సిన అవసరాన్ని నర్సింగ్ విద్యార్థులు, శానిటేషన్ సిబ్బంది ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. లక్ష్మీ భాయి, (సిఎస్ఆర్ఎంఓ) డా. పద్మజ, డిప్యూటీ (సిఎస్ఆర్ఎంఓ) డా. పద్మజ, అడ్మినిస్ట్రేషన్ అధికారులు సింధు సుబ్రహ్మణ్యం, డా. వెంకట రమణ, డా. శివ బాల, డా. కిరణ్ కుమార్, డా. సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి భాయి, నర్సింగ్ విద్యార్థులు మరియు ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్చురీ విభాగానికి డీప్ ఫ్రీజర్ వితరణ

**మోబిస్ ఇండియా సేవలను అభినందించిన జిల్లా కలెక్టర్ ఆనంద్**



**అనంతపురం, వైద్యం, మార్చి 28,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ ఫ్రీజర్ల సదుపాయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మోబిస్ ఇండియా అధినేతలు జిజిహెచ్ లోని మార్చురీ విభాగానికి అవసరమయ్యే డీప్ ఫ్రీజర్ లను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద అందించారని, మరింతమంది దాతలు ముందుకు వచ్చి జిల్లా పెద్దాసుపత్రి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. జిల్లా వాసులకు ఫోరెన్సిక్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్న డిపార్ట్మెంట్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.మల్లేశ్వరి, ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత, ఫారెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ శంకర్ ఈ కార్యక్రమంలో మోబిస్ ఇండియా అధినేతలు పిఎన్. శ్రీనివాస్, సింధూజను జ్ఞాపికలతో శాలువాతో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గాలేటి చంద్రశేఖర్, ఆలంబన జనార్ధన్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు ఓలేటి రత్నమయ్య, ఫోరెన్సిక్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పి విష్ణువర్ధన్, డాక్టర్ వినీల్ రాజ్, డాక్టర్ భార్గవ రాజు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**అడ్మిషన్లు ప్రారంభమంటూ నగరంలో ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలను తొలగించాలి.**




**నంద్యాల మార్చి 28 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు. శనివారం సాయిబాబా నగర్ లో ఉన్న పి డి ఎస్ యు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలైన మరియు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు 2026 –27 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని అన్నారు. కార్పొరేట్ సంస్థల వారు బహిరంగంగా కరపత్రాలు, ఫ్లెక్సీలు వేసి అడ్మిషన్ల కొరకు ఎలక్షన్ ప్రచారం రీతిలో కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ది ఢిల్లీ పబ్లిక్ స్కూల్, దిక్రిడో ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ,ఇంటర్నేషనల్ స్కూల్, అని ప్రచారం నిర్వహిస్తూ ఐఐటి ట్రిబుల్ ఐటీ ఫౌండేషన్ లాంటి కోర్సులు ఎల్కేజీ నుండే ప్రారంభిస్తున్నామని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఆర్థికమే ధ్యేయంగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సరైనటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించి,చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థ యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేర్లతో పిఆర్ఓ లను ,ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్ ఫీజులతో పాటు,స్పెషల్ ఫీజు,పుస్తకాల ఫీజులని విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో పాఠశాలలో ఉధృతమైన ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షులు షైక్.షాహిద్, జిల్లా నాయకులుమధుకిరణ్, బాలాజీ, వినోద్,కిరణ్,నాయక్,రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సన్మాన కార్యక్రమం




**గుత్తి మార్చి 28: (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం లో సావిత్రిబాయి పూలే మహిళా హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో యోగివేమన యూనివర్సిటీ నుండి పీహెచ్డీ (మ్యాథమెటిక్స్ )కాన్వకేషన్ అందుకున్న గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు మరియు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ ఇ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ నారాయణ నాయక్ సావిత్రిబాయి పూలే మహిళా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకురాలు టి భారతి ,గుత్తి మండల అభివృద్ధి అధికారి ఎంపిడిఓ ప్రభాకర్ నాయక్, గుత్తి మండల విద్యాశాఖ అధికారి మనోహర్, ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా సన్మానించడం జరిగింది. డాక్టర్ ఆర్ నారాయణ నాయక్ గుత్తి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇసురాళ్లపల్లి గ్రామము లో గణిత శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేయుచున్నారు. కార్యక్రమంలో బి.ఎస్.పి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు యూటీఎఫ్ జోనల్ అధ్యక్షులు అహోబిలేసు మధు చక్రవర్తి అడ్వకేట్ సాలప్ప బీఎస్పీ నాయకులు విజయ్ ఏపీటీఎఫ్ నాయకులు రవి అంబేద్కర్ అవార్డు గ్రహీత బెంజ్మన్ ఆర్ ప్రవీణ్ కుమార్ ఎం రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు



# వాలీబాల్ నేపథ్యంలో వరుణ్ తేజ్ 'బరి'

# క్లాప్ కొట్టిన పవన్ కళ్యాణ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త సినిమా శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. 'బరి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ఆయన క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు .హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ వేడుక జరిగింది. ఈ సినిమాకు వరుణ్ తేజ్ సోదరి నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. తన సొంత నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై ఆమె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదువంశీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలోని వాలీబాల్ క్రీడ ఆధారంగా ఈ సినిమాను హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' అనే హారర్ కామెడీ సినిమా షూటింగ్‌లో చివరి దశలో ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే 'బరి' చిత్రీకరణలో పాల్గొంటారు. ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో 2027 సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# వెంకటేశ్, కల్యాణ్‌రామ్‌తో అనిల్ రావిపూడి కొత్త సినిమా!



వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్టును ప్రకటించారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా ఒక భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు అధికారికంగా వెల్లడించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది.

ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'భగవంత్ కేసరి', 'మన శంకర వర ప్రసాద్ గారు' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న మరో భారీ చిత్రమిది. సురేశ్ ప్రొడక్షన్స్, అర్చన ఈ సినిమాను సమర్పిస్తుండగా, జీ స్టూడియోస్ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది. ఈ ప్రాజెక్టుకు తాత్కాలికంగా  అనే వర్కింగ్ టైటిల్స్ పెట్టారు.వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఇది ఐదో సినిమా కావడం విశేషం. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన »F2», »F3', 'సంక్రాంతికి వస్తున్నాం', »MSG» వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. అలాగే, 'పటాస్' వంటి సూపర్ హిట్ తర్వాత కల్యాణ్ రామ్‌తో అనిల్ రావిపూడికి ఇది రెండో సినిమా. దీంతో ఈ కొత్త ప్రాజెక్టుపై అంచనాలు భారీగా పెరిగాయి.


ఈ సినిమాను పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నట్టు చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించనున్నారు.



# కొలిక్కిరాని వివాదం..

## 'జననాయగన్' మరోసారి రిలీజ్ వాయిదా?

తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన చిత్రం 'జననాయగన్'. నిజానికి ఈ సినిమా ఈ జనవరిలోనే విడుదల కావాల్సింది. కానీ, కొన్ని కారణాల వల్ల సినిమా విడదుల వాయిదా పడుతూ వస్తుంది. తాజ నివేదికల ప్రకారం ఈ సినిమా విడుదల మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. విజయ్ పుట్టినరోజున ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు వార్తలు వచ్చాయి. జూన్ 22న హీరో పుట్టినరోజు కావడంతో ఈ సినిమాను జూన్ 18వ తేదీన విడుదల చేస్తారని అంతా భావించారు. అయితే ఈ తేదీకి కూడా సినిమా రావడం కష్టమే అని తెలుస్తోంది. ఈ సినిమాను నిర్మించిన కెవిఎన్ ప్రొడక్షన్స్ చేతిలో ప్రస్తుతం భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో యశ్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా ఒకటి. ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. దీంతో జులైలో 'జననాయగన్'ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది.



# పట్టు పరికిణిలో ఆకట్టుకుంటున్న వైష్ణవి చైతన్య!

వైష్ణవి చైతన్య ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసే ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఆమె పట్టు పరికిణి ధరించి దిగిన ఫోటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. వెండితెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో ఆమెను చూడటం తమకు ఎంతో ఇష్టమని ఫాలోయర్స్ కామెంట్స్ చేస్తున్నారు. కేవలం ఫోటోలతోనే కాకుండా, తన కళ్ళతోనే హావభావాలను పలికిస్తూ కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టిస్తోంది. ఈ ఫోటోలు చూస్తుంటే వైష్ణవి తన తదుపరి సినిమాల కోసం ఎంతగా సిద్ధమవుతుందో అర్థమవుతోంది ఆనంద్ దేవరకొండతో మరో క్రేజీ ప్రాజెక్ట్: కెరీర్ విషయానికి వస్తే, వైష్ణవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. 'బేబీ' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత మళ్ళీ ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఏ పిక్' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. గత ఏడాది సిద్ధూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటించి మెప్పించిన ఈ భామ, ఇప్పుడు ఈ కొత్త సినిమాతో తన సక్సెస్ గ్రాఫ్‌ను మరింత పెంచుకోవాలని చూస్తోంది.ాశ్రీంశీ =ముఃస - లగాన్..దంగల్..బుచ్చిబాబు భలే ప్లాన్ చేశాడే! కోలీవుడ్‌లోనూ వైష్ణవి హవా.. వరుస ఆఫర్లు: వైష్ణవి క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాలేదు. ఇప్పుడు పక్కనే ఉన్న కోలీవుడ్‌లోనూ ఈమె పేరు మారుమోగుతోంది. తమిళ స్టార్ హీరో ఆర్య సరసన ఒక క్రేజీ ప్రాజెక్టులో నటిస్తున్నట్లు సమాచారం. అలాగే హీరో విష్ణు విశాల్ సరసన మరో తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా మొదలయ్యాయని తెలుస్తోంది. ఇవే కాకుండా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలో కూడా ఆమె కీలక పాత్ర పోషిస్తోంది

# కరుప్పుపై భారీ హైప్.. టెన్షన్ లో ఫ్యాన్స్



సూర్య నటించిన కరుప్పు సినిమా రిలీజ్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఇది సూర్య కెరీర్‌లో ఒక కీలక మలుపుగా మారుతుందా అనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో ఎక్కువగా వినిపిస్తోంది. గత కొన్ని సినిమాలుగా ఆయన చేసిన ప్రయోగాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, ఫ్యాన్స్ కోరుకునే సూర్య మాత్రం కనిపించలేదనే భావన ఉంది. ఈ నేపథ్యంలో కరుప్పు ఆ లోటును తీర్చగలదా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారిందిఈ సినిమాను కేవలం కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మాత్రమే కాకుండా, ఒక స్పష్టమైన సోషల్ మెసేజ్ తో తెరకెక్కించినట్లు చెప్పడం ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమలో హీరోలను ఎక్కువగా రౌడీలు లేదా పోలీసులుగా చూపించే ట్రెండ్ పెరిగిందని, దీంతో పాత్రల్లో సహజత్వం, వైవిధ్యం తగ్గిపోయిందని బాలాజీ అభిప్రాయపడుతున్నారు. కరుప్పు ద్వారా సాధారణ మనుషుల కథలను, రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలను తెరపైకి తీసుకురావడానికి బాలాజీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

## ప్రభాస్ సినిమాలో రోల్..

# విమర్శలపై స్పష్టత ఇచ్చిన నటి రాశి




ప్రభాస్ సినిమాలో నటించడంపై తాను చేసిన వ్యాఖ్యల గురించి సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై సీనియర్ నటి రాశి స్పందించారు. ప్రభాస్‌కు తల్లి పాత్రలో తప్ప మరే ఇతర పాత్రలోనైనా నటించడానికి సిద్ధమేనని, సోదరి పాత్ర చేయనని తాను చెప్పలేదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రభాస్ అంటే ఇష్టమని, కానీ ఆయనకు తల్లిగా మాత్రం నటించనని రాశి చెప్పిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో ఆమె ఈ వివరణ ఇచ్చారు. ప్రభాస్ సినిమాలకు గతంలో డబ్బింగ్ చెప్పినా, ఆయన్ను కలవలేకపోయానని కూడా ఆమె గతంలో పేర్కొన్నారు.

'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రాగ్ మయూర్ హీరోగా 'అనుమాన పక్షి' తెరకెక్కింది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి వినగానే ఎలాంటి సందేహం లేకుండా ఒప్పుకున్నానని రాశి తెలిపారు. హీరోయిన్‌గా 148 సినిమాలు చేశానని, ఆ అనుభవంతో ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది ధీమాగా చెబుతున్నానన్నారు.

# రోడ్డు టెర్రర్...

## రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ గా బెంగళూరు చిత్తూరు - జాతీయ రహదారి

- నెలకొక ప్రమాదం..
- ఈ ప్రమాదాల్లో ఎంతో మంది విగతజీవులు బలి..
- తాజాగా బంగారుపాళ్యం మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం..
- ముగ్గురు అక్కడికక్కడే మృతి..
- రోడ్డు భద్రత ఏది..!



**ఏపీ బ్యూరో, మార్చి 28 - (రిపబ్లిక్ న్యూస్) -**
చిత్తూరు జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు కునుకు లేకుండా చేస్తున్నాయి. 15 రోజుల కిందట
ఈ మార్గంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదు మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన మరవక ముందే మరో సారి దారుణ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని రాష్ట్రాన్ని కుదిపేసింది. బంగారుపాళ్యం మండల కేంద్రమైన శేషాపురం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన వారిలో నాలుగేళ్ల చిన్నారి ఉన్నట్టు గుర్తించారు. ఇటీవలే ఇదే మార్గంలో జరిగిన ప్రమాదం మరవకముందే మరోసారి ఇదే తరహా ఘటన చోటుచేసుకోవడం వాహనదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం తెలిపిన తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌కు చెందిన శ్రీధర్ రావు (46), ఆయన భార్య లక్ష్మి (42), కుమార్తె అద్విక (4) కలిసి బెంగళూరు నుండి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం కారులో బయలుదేరారు. ప్రయాణం మధ్యలో చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని శేషాపురం జాతీయ రహదారి వద్ద ఘోర ప్రమాదం సంభవించింది. పలమనేరు వైపు నుండి చిత్తూరు దిశగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు సర్వీస్ రోడ్డులో ఆగి ఉండగా, అతివేగంతో వచ్చిన కారు వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యి, బస్సు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన కారు డ్రైవర్‌ను అత్యవసర సేవల సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో అతివేగం, డ్రైవర్ అలసట ప్రమాదానికి ప్రధాన కారణాలుగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దైవ దర్శనం కోసం బయలుదేరిన కుటుంబం ఇలా మార్గమధ్యలోనే మృత్యువాత పడటం విషాదాన్ని మిగిల్చింది. కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామిని దర్శించడానికి బయలుదేరితే ప్రాణాలే పోయాయి. మాకు మిగిలింది కన్నీళ్లు మాత్రమేనంటూ వారి రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఇటీవల ఇదే జిల్లాలో జరిగిన మరో ఘోర ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటన ప్రజల మదిలో ఇంకా నిలిచే ఉంది. అలాంటి ఘటన మరువకముందే మళ్లీ అదే తరహా ప్రమాదం చోటుచేసుకోవడం చిత్తూరు జిల్లాలో రహదారి భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..








## జిల్లా కేంద్రంలో 30న పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, బ్యూరోమార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):**
సోమవారం నాడు నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఉదయం టిడ్కో గృహాల ప్రారంభోత్సవం, మధ్యాహ్నం పి-4 కార్యక్రమం నిర్వహణ ఉండటంతో పీజీఆర్ఎస్‌ను రద్దు చేయాల్సి వచ్చినట్లు ఆమె వెల్లడించారు. అయితే, డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ పట్టణాలు, మండల తహసీల్దార్ కార్యాలయాలలో పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను సంబంధిత కార్యాలయాల్లో ప్రత్యక్షంగా సమర్పించవచ్చని, లేదా ఆన్లైన్‌లో మీ వెబ్‌సైట్ ద్వారా కూడా వినతులను నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి అనవసరంగా నంద్యాల జిల్లా కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఇంటినుంచే పరిశుభ్రతకు శ్రీకారం

### కలెక్టర్ డా. ఏ.సిరి పిలుపు

**"స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన**

**జీరో వేస్ట్ సంస్థలపై మార్గదర్శకం నీటి సంరక్షణ, మొక్కల నాటడం పై దృష్టి**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 28)**
పరిశుభ్రత ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి పిలుపునిచ్చారు. శనివారం "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా సెయింట్ జోసెఫ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు."జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్స్" అంశంపై తడి, పొడి, పారిశుధ్య మరియు ప్రత్యేక వ్యర్థాల విభజన గురించి వివరించారు. ప్రతి ఇంటిలో చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణపై కూడా విద్యార్థులు దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి వినియోగాన్ని నియంత్రించడం అత్యవసరమని చెప్పారు. ఈ ఏడాది జిల్లాలో 45 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో నర్సరీలను సిద్ధం చేశామని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు.బయటి ఆహారపు అలవాట్లపై హెచ్చరిస్తూ, ఇంట్లో వండిన ఆహారాన్నే ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ప్రిజర్వేటివ్స్, రసాయనాలు కలిగిన ఆహారం వల్ల క్యాన్సర్, డయాబెటిస్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు.మొబైల్, ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పాజిటివ్ థింకింగ్, కృషి ఉంటే విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ పరిశుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడమే "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. సాంకేతికత వల్ల గ్రామీణ విద్యార్థులకు కూడా విద్యా వనరులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. సాకులు చెప్పకుండా కృషి చేస్తే ఎవరైనా విజయం సాధించగలరని ఆయన పేర్కొన్నారు.

**తస్మాత్ జాగ్రత్త....మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి**

## జైలు శిక్ష విధించిన న్యాయస్థానం...

### 30 రోజులు జైలుశిక్ష...3,000/-జరిమాన



**కొలిమిగుండ్ల మార్చి 28 రిపబ్లిక్ (న్యూస్)**
కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో CI రమేశ్ బాబు మరియు వారి సిబ్బందితో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించుండగా టిప్పర్ డ్రైవర్ ఎ. చిన్న ఆంజనేయులు వయస్సు 46సంలు, తండ్రి చెన్నప్ప సిద్దయ్య గుట్ట కాలనీ, ధర్మవరం పట్టణం, అనంతపురం జిల్లా అను వ్యక్తికి డ్రంకన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు నిర్ధారణ కావడంతో సదరు వ్యక్తిని అదుపులోనికి తీసుకొని నేడు బనగానపల్లె జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు లో హాజరు పెట్టగా కోర్టు ముద్దాయిని విచారించి, ఒక నెల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.3,000 జరిమాన విధించినట్లు కొలిమిగుండ్ల పోలీసులు తెలిపారు
కోర్టు ఆదేశాల మేరకు కొలిమిగుండ్ల పోలీసులు ముద్దాయిని ఆళ్లగడ్డ సబ్ జైలుకు తరలించినారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు మరియు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు తెలియజేశారు

## ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లాష్ ఫ్లడ్స్ పై మాక్ డ్రిల్ నిర్వహణ







**నంద్యాల, బ్యూరోమార్చి 28 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ అవగాహన కార్యక్రమాల భాగంగా ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లాష్ ఫ్లడ్స్ (వరదలు)పై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని చెరువుకట్ట (వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశం)వద్ద ఫ్లాష్ ఫ్లడ్స్ పై మాక్ డ్రిల్ కార్యక్రమం జరిగింది. ఎఎస్పి ఎం. జావళి ఆల్ఫోన్స్, ఆర్డీఓ విశ్వనాథ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక, ఆర్టీఓ శివ కుమార్ రెడ్డి, ఎఆర్డీ ఎస్పీ శ్రీనివాసరావు, ఎన్ డి ఆర్ ఎఫ్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ, ఏ ఆర్ రిజర్వు ఇన్స్పెక్టర్ బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రామునాయక్ మాట్లాడుతూ గతంలో తుఫానులు, వరదల సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలపై అధికారులకు మరియు ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. రాష్ట్రం నుండి వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు ప్రాక్టికల్ మాక్ డ్రిల్ ద్వారా వివిధ అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ప్రజలను సురక్షితంగా ఎలా తరలించాలి అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎఎస్పి ఎం. జావళి ఆల్ఫోన్స్ మాట్లాడుతూ ముఖ్యంగా బోట్ క్యాప్‌సైజ్ అయినప్పుడు చేపట్టాల్సిన రెస్క్యూ ఆపరేషన్లు, బాధితులను రక్షించే విధానాలపై ప్రత్యక్షంగా ప్రదర్శనలు ఇచ్చి అవగాహన కల్పించారన్నారు. అలాగే విపత్తు సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఎంత కీలకమని వివరించారు. రెస్క్యూ ఆపరేషన్లలో విభాగాల మధ్య సమర్థవంతమైన కోఆర్డినేషన్ ద్వారా ప్రాణ నష్టం తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది అందరూ కలసికట్టుగా పనిచేస్తేనే అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలమని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విపత్తుల సమయంలో ఆందోళనకు లోనుకాకుండా తగిన జాగ్రత్తలు పాటించడం, ప్రాణనష్టం తగ్గించే టెక్నిక్స్ వినియోగం వంటి అంశాలను ఆర్డీఓ వివరించారు. అంతేకాక అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సిపిఆర్ వంటి లైఫ్ సేవింగ్ విధానాలపై కూడా శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మాక్ డ్రిల్‌ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ బృందానికి మరియు సహకరించిన విభాగాలందరికీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## నల్లమలలో మళ్లీ మంటలు



**మహానంది, మార్చి 28, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది ఆలయం వెనుక ఉన్న నల్లమల అడవుల్లో మళ్లీ మంటలు వ్యాపించాయి. ఇటీవల నల్లమల అడవుల్లో మంటలు వ్యాపించడంతో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా స్పందించి రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ అధికారులకు సూచనలు ఇచ్చి అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి శనివారం మంటలు చెలరేగుతుండటంతో అటవీ శాఖ అధికారులు స్పందించి మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

## పెండింగ్ మ్యుటేషన్ల క్లియరెన్స్‌కు చర్యలు అవసరం

**సేవలలో పారదర్శకతతో ప్రజల సంతృప్తి పెంపు**

**భూసంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల, బ్యూరోమార్చి 28(రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలను వేగవంతంగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో మండల తాసిల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గడువు దాటి పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను ప్రాధాన్యంగా తీసుకుని వారం రోజుల్లోగా పూర్తిచేయాలని ఆర్డీవోలు మండల తాసిల్దార్లను ఆదేశించారు. జిల్లాలోని బనగానపల్లె డివిజన్‌లో 66, డోన్‌లో 21, ఆత్మకూరు డివిజన్‌లో 172, నంద్యాల డివిజన్‌లో 227 మ్యుటేషన్లు అలా గడువు దాటి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, వీటిని త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. టెక్నికల్ సమస్యలు ఉన్న మ్యుటేషన్లను కూడా పరిష్కార మార్గాలు కనుగొని పూర్తి చేయాలని, అభ్యంతరాలు ఉన్న దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అవసరమైతే తిరస్కరించాలని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ ప్రక్రియలో భాగంగా బనగానపల్లె డివిజన్‌లో 26 గ్రామాలు, డోన్‌లో 7, ఆత్మకూరులో 41, నంద్యాలలో 38 గ్రామాలు కలిపి మొత్తం 112 గ్రామాల్లో ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రీసర్వేకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా వేగంగా పరిష్కరించి ప్రజల సంతృప్తి పెంచాలన్నారు. కొత్తబురుజు గ్రామంలో నెల వ్యవధిలో 74 పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం గారు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఈ విషయంపై డోన్ తహసీల్దార్‌ను ప్రశ్నించగా, ప్రస్తుతం 27 సర్వీసింగ్ అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఏప్రిల్ 9వ తేదీలోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో కుల ధృవీకరణ పత్రాల కోసం మొత్తం 7,07,462 దరఖాస్తులు అందగా, 2,71,039 ఆమోదించబడ్డాయని, మిగిలిన 4,36,423 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. వీటిలో గణనీయమైన సంఖ్యలో కేసులు కేవలం పర్యవేక్షణ లోపం వల్ల నిలిచిపోయాయని పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలో మాత్రమే 15,500కు పైగా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 1,28,000 మంది వలస కార్మికులకు సంబంధించిన వివరాల సేకరణలో ఇబ్బందులు ఉన్నాయని గుర్తించి, దీనికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరస్కరించబడిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించి అర్హులకు న్యాయం చేయాలి. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, డేటా ఎంట్రీలో జరిగిన పొరపాట్లను వెంటనే సరిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి. ప్రజలకు పారదర్శక, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com